PVR ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	సినీ ప్లానెట్ - కొంపల్లి	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
PVR అట్రియమ్ - గచ్చిబౌలి	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్	లక్ష్మీకళ సినీప్లెక్స్ - మూసాపేట్
PVR ఎస్2 నోమ - మల్లాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా	మూవీమ్యాక్స్ - మౌలాలి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్	జె.పి.సినిమాస్ - చందానగర్
ఎం.పి మాల్ - కాచిగూడ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి	మరియు మీ అభిమాన థియేటర్లలో

జన జాతరకు వేళాయె..


మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

వరంగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది.

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆది వాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వన దేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్లతో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.


సమ్మక్క గద్దె


సారలమ్మ గద్దె



నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

- నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు
- నాలుగు రోజులు పూజలందుకోనున్న వనదేవతలు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరణి రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడువునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

24న వనప్రవేశం


జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలు వైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి ఆలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయం లో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.


కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు







25న 'వనపర్తి ఒడిలో' పుస్తక ఆవిష్కరణ సభ

పాలమూరు, ఫిబ్రవరి 20 : వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 25న 'వనపర్తి ఒడిలో' పుస్తకావిష్కరణ సభ నిర్వహించనున్నామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1959 నుంచి 1973 మధ్య కాలంలో వనపర్తి పట్టణంలో నివాసం ఉండి బాల్యం, తొలి యౌవనం గడిపిన రాఘవశర్మ అప్పటి తన వనపర్తి జ్ఞాపకాలను యాభై ఏళ్ల తర్వాత రాసినట్లు పేర్కొన్నారు. ఆయన జ్ఞాపకాలను తమ వేదిక పుస్తకంగా ముద్రించిందన్నారు. పుస్తకావిష్కరణ సభకు వేదిక అధ్యక్షులు ప్రొఫెసర్ జి.హరగోపాల్ ముఖ్య అతిథిగా, డా.జతీన్‌కుమార్, సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, వనపర్తి స్థానిక మిత్రులు, వేదిక మిత్రులు స్నేహవాక్యం వినిపించేందుకు హాజరవుతారని చెప్పారు. సభను కే.వెంకటేశ్వర్లు, ఎండీ.ఇక్బాల్‌పాషాల అధ్యక్షతన నిర్వహించనున్నట్లు వివరించారు.



పార్టీ పూర్వ వైభవం కోసం చేరికలను ఆహ్వానిస్తున్నాం

- బీఆర్ఎస్‌ను నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యం
- ఎంపీ, సర్పంచ్, పరిషత్ ఎన్నికలో సత్తాచాటేందుకు అందరూ ఏకం కావాలి
- ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : అసెంబ్లీ ఎన్నికల్లో ఒక ఎమోషన్‌తో కొట్లాడి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు పార్టీ పూర్వవైభవం కోసం అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు పోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉండి చురుగ్గా పనిచేసిన వారెందరో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వాళ్ల వేధింపులకు భయపడి కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారన్నారు. ఇప్పుడు వారంతా తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం పార్టీలోకి వచ్చేవారందరినీ ఆహ్వానించండని చెప్పడం జరిగిందన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో చేరికలు తన వ్యక్తిగతం కాదని, ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఒకటే విధానం ఉంటుందని, అది పార్టీ విధానమని తేల్చిచెప్పారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు, ఆ తరువాత సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించాలని, ఇందుకోసం పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వ్యవస్థలు నాశనం అయ్యాయని, అందుకే బీఆర్ఎస్‌ను నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా పార్టీ పునర్నిర్మాణం జరగాలన్నదే తమ వ్యూహమని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉండి ఇతర పార్టీలకు చెందిన వ్యక్తి మునిసిపల్ చైర్మన్‌గా ఉంటే పాలనాపరంగా చాలా ఇబ్బందులు ఉంటాయని, అవిశ్వాస తీర్మానంతో పీఠం దక్కించుకోవడం జరిగిందన్నారు. ఐదుమంది సభ్యుల బలం ఉన్న తాము ఈ పీఠం దక్కించుకోవడం అంత ఆషామాషీ వ్యవహారం కాదని, అయినా అందరూ కలిసికట్టుగా పనిచేసి అన్ని పార్టీల కౌన్సిలర్ల మద్దతుతో చైర్మన్‌ను దక్కించుకున్నామని, రాష్ట్రంలోనే అతి పెద్దదైన పాలమూరు మునిసిపాలిటీని దక్కించుకోవడం ద్వారా రాష్ట్రం మొత్తం కాంగ్రెస్ బలోపేతానికి దోహదపడిందన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, సత్తూర్ చంద్రకుమార్‌గౌడ్, బెనహర్, బెక్కరి అనిత, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌ల చేరికపై అసంతృప్తి

కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ల చేరికపై పార్టీలోని ఓ వర్గం వ్యతిరేకిస్తూ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. మంగళవారం బీఆర్ఎస్‌లో 12 మంది కౌన్సిలర్లు ఎమ్మెల్యే యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారి చేరికలను కొందరు వ్యతిరేకిస్తూ పార్టీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో ఉన్నపుడు వారికి వ్యతిరేకంగా పోరాడిన తమపై కేసులు పెట్టించారని, ఇప్పుడు ఎలా పార్టీలో చేర్చుకుంటారని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ పార్టీ కార్యాలయంలో బైఠాయించి చొక్కా విప్పి నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేసిన తమను గుర్తించరు కానీ కొత్తగా వచ్చిన వారిని మాత్రం ఆహ్వానించడం దారుణమన్నారు. మరో కార్యకర్త నరేశ్ కంటతడి పెట్టగా నాయకులు జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమింపజేశారు.

ప్రజ్వలిస్తున్న ఆధ్యాత్మిక భావన

- మాజీ పీఎం పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావు
- వట్టెం ఆలయంలో ప్రభాకర్‌రావు ప్రత్యేక పూజలు


నవోదయ విద్యాలయంలో పీవీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న పీవీ ప్రభాకర్‌రావు

బిజినేపల్లి, ఫిబ్రవరి 20: ఆలయ పరిసరాల్లోని అణువణువులో అధ్యాత్మిక భావన ప్రజ్వరిల్లుతోందని భారతరత్న, మాజీ పీఎం పీవీ నరసింహారావు తనయుడు పీవీ ప్రభాకర్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెంలోని గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డితో కలిసి అయన స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీవీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గుట్టపై పచ్చని చెట్లు, రామానుజచార్యుల పార్కు, పక్కనే వెంకటాద్రి రిజర్వాయర్ నిర్మాణం, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయ పరిసరాల్లో భక్తిభావన నిండినట్లుగా ఉందన్నారు. తన తండ్రి మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దేశంలోని అత్యంత ఉన్నత పురస్కారం కేంద్రం ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేసి, ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పక్కనే ఉన్న జవహర్ నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థులతో కలిసి పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించి, మాట్లాడారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో సన్మానించారు. వారి వెంట ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సందడి ప్రతాప్‌రెడ్డి, సందడి నరేందర్‌రెడ్డి, అడ్వకేట్ జంగం రవికుమార్, ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జానకిరాములు, భాస్కరాచారి, వెంకట్‌రెడ్డి, విట్టల్‌సింగ్ తదితరులున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై ప్రిసిల్ల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ సాగుల శ్రీరాములు(46) ఆరు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి భరించలేని కడుపునొప్పి రావడంతో ఇంటి ఆవరణలోని మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం మృతుడి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హన్వాడ, ఫిబ్రవరి 20 : ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రానికి చెందిన ఇస్నాతి రమేష్(42) ఆదివారం గ్రామంలోని వైన్స్ సమీపం నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఇదే మండలం మాదారం గ్రామానికి చెందిన మల్లేష్ బైక్‌పై హన్వాడ నుంచి గ్రామానికి వెళ్తూ ఎదురుగా వస్తున్న రమేష్ బైక్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

హన్వాడ, ఫిబ్రవరి 20 : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. కోయిలకొండ మండలంలోని ఆచార్యపూర్ వాగు నుంచి ఇసుకను జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం తెల్లవారుజామున చిన్నదర్పల్లి తండా వద్ద టిప్పర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు.



గజవాహన సేవలో మన్యంకొండ వేంకటేశ్వరస్వామి

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 20 : మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఆలయంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి గజవాహన సేవలో ఊరేగారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకులు, స్వామివారిని అలంకరించి అభిషేకాలు పూజలు చేశారు. అనంతరం పల్లకిలో గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి శ్రీనివాస రాజు, అడిషనల్ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస్, ఆలయ వంశపార ధర్మకర్త రామకృష్ణ, సూపరింటెండెంట్ నిత్యానందం, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

మహిమాన్వితమైన సింహగిరి క్షేత్రం

- లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మునిసిపల్ చైర్మన్



స్వామికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మునిసిపల్ చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్

పాలమూరు, ఫిబ్రవరి 20 : లక్ష్మీ నరసింహస్వామి కటాక్షం మనందరిపై ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సింహగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో 37వ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్సీ కె.దామోదర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్‌లతో కలిసి పట్టువస్త్రాలను సమర్పించారు. ఎంతో మహిమాన్వితమైన సింహగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలు సమర్పించటం అదృష్టమని అన్నారు. 37 ఏళ్ల నుంచి ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తూ ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించటం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం నిర్వాహకులు అతిథులకు స్వామికి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయంలో పూజారులచే ప్రత్యేక సుదర్శన నరసింహ హోమం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొకుంట్ల చంద్రమౌళిగుప్తా, ఈఓ రంగాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఓంప్రకాశ్‌బాంగర్, సూది రాము, పోల శ్రీనివాస్, ఎం.రమేష్, డి.బాలకిష్టయ్య, ఉమారాణి, కె.శేఖర్, సత్యం పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం



స్వాగతం పలికిన కొండా ప్రశాంత్‌రెడ్డి తదితరులు

దేవరకద్ర, ఫిబ్రవరి 20 : నారాయణపేట జిల్లా కృష్ణ వద్ద విజయ సంకల్ప యాత్ర ప్రారంభించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని దేవరకద్ర వద్ద ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. దేవరకద్ర మీదుగా వెళ్తుండడంతో బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలతో వచ్చి కిషన్‌రెడ్డిని శాలువతో సన్మానించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కిషన్‌రెడ్డి నాయకులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవయ్య నాగిరెడ్డి, నారాయణరెడ్డి, రాజు, ఆంజనేయులు, వెంకటేష్, అరున్, తదితరులు పాల్గొన్నారు.

45 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ ఇవ్వాలి

- తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి

పాలమూరు, ఫిబ్రవరి 20 : 45ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు పింఛన్ కల్పించాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, జిల్లా యువజన క్రాంతి అధ్యక్షుడు సి.హెచ్. రాజు, నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రజక కులవత్తిదారులకు పింఛన్‌తో పాటు ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. కులవృత్తి చేసుకుంటూ ప్రమాదవశాత్తు మరణిస్తే జీవితబీమా కింద రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ప్రతీ గ్రామంలో దోబీఘాట్లు నిర్మించాలని, 102 జీవోను తక్షణమే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మైబు, సి.హెచ్ గోపాల్, నరసింహులు, రమేష్ పాల్గొన్నారు.

21 నుంచి మాదిగల జోడో యాత్ర

పాలమూరు, ఫిబ్రవరి 20 : మాదిగల 12 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని చేపట్టనున్న మాదిగల జోడోయాత్ర 21వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డమీది గోపాలకృష్ణ ప్రకటించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ అంబేడ్కర్ విగ్రహం దగ్గర కరపత్రం విడుదల చేశారు. డాక్టర్ పిడమర్తి రవి నాయకత్వంలో చేపట్టిన యాత్ర 21 నుంచి 29వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తుందన్నారు. 25వ తేదీ సాయంత్రం 4గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి యాత్ర వస్తుందన్నారు. కార్యక్రమంలో బొర్ర సురేష్, జి.దినేష్, సుమన్, ఉమేష్‌కుమార్, సంతోష్‌కుమార్, రవీందర్, రాకేష్, కిరణ్, అజయ్, ప్రకాష్, నరేష్ పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 20 : జిల్లా విద్యాశాఖ, డ్రీం ఫోర్స్ ఫౌండేషన్, డాక్టర్ అబ్దుల్‌కలాం సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 25 న టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టాలెంట్ టెస్టుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పదిలో వందశాతం ఫలితాలు సాధించాలన్న ఉద్దేశంతో అన్ని పాఠశాలల్లో చదివే పది విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలోని పదవ తరగతి విద్యార్థులందరు ఈ టాలెంట్ టెస్టు రాయాలన్నారు. కార్యక్రమంలో రిటైడ్ డీఈవో ఎస్.విజయ్‌కుమార్, డ్రీమ్‌ఫోర్స్ ఫౌండర్ టీఎస్ శ్రీధర్, ఏఎస్‌వో హక్, ఏపీవో మధుసూదన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన వెన్నాచేడ్ విద్యార్థిని

గండీడ్, ఫిబ్రవరి 20 : పిల్లల మర్రి సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాలో నిర్వహించిన జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌లో మండల పరిధిలోని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్.శిరీష జిల్లా ప్రథమ బహుమతి పొంది రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. దీంతో పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు విద్యార్థినిని అభినందించారు.

సైనిక్ స్కూల్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఫిబ్రవరి 20 : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక పాఠశాలలు, కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల ప్రాంతీయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు మార్చి ఒకటో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మార్చి 10న ప్రవేశపరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆల్వాన్‌పల్లి గ్రామ శివారులో ఉపాధి పథకంలో కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రోజు వారీగా కూలి రూ.800 ఇవ్వాలని, 200 రోజుల పాటు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో కూలీలకు సరైన పనిముట్లు లేవని, టెంటు సౌకర్యం లేదని, మంచినీటి సౌకార్యం కల్పించడంలేదని, అందుబాటులో మెడికల్ కిట్టు లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదయ్య, మధు, శాంతయ్య, పాండు, నాగేశ్, శోభ, మంజుల, బాలయ్య, చెన్నయ్య, రాజు పాల్గొన్నారు.

తాగు నీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- సమీక్షలో కలెక్టర్ జి. రవి నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి. రవినాయక్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : వేసవి కాలంలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ జి. రవినాయక్ సంబంధిత శాఖల జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఐడీఓసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో తాగునీరు, పాధిహామీ పథకం, ఆస్తి పన్ను, పారిశుధ్యం తదితర అంశాలపై సమీక్షించారు. మిషన్ భగీరథ ద్వారా నీటిని అందివ్వలేని చోటా ట్యాంకర్ల ద్వారాగాని లేదా బోర్లు రిపేర్ చేసి ప్రజలకు నీటిని అందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో స్థానికులకు పని కల్పించాలని, పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో ఆస్తి పన్ను వసూలు చేసి ఆన్‌లైన్‌లో త్వరగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. నర్సరీలో మొక్కలను పెంచాలని, నాటిన మొక్కలు ఎండిపోకుండా వాటికి నీరు తరచుగా పోస్తూ కాపాడుకోవాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జడ్పీ సీఈఓ రాఘవేందర్ రావు, డీఆర్డీవో నర్సింహులు, డీపీవో వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

నిధులు లేక నిలిచిన పనులు

- రెండేళ్లుగా పూర్తికాని పనులు

- కంకర, దుమ్ముతో ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు





హన్వాడ నుంచి గుడిమల్కాపూర్ వరకు వేసిన కంకర (ఇన్‌సెట్లో) రోడ్డు పక్కన కోతకు గురైన రోడ్డు

హన్వాడ, ఫిబ్రవరి 20 : ప్రతీ పల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు చేసిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు వేగంగా చేయడం లేదు. హన్వాడ ప్రధాన రహదారి నుంచి టంకర గుడిమల్కాపూర్ గ్రామాలకు 6.12 కిలో మీటర్ల రోడ్డు చేసేందుకు 2021లో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన ద్వారా రూ.3 కోట్ల 97 లక్షల 30 వేల నిధులు మంజూరయ్యాయి. 2021లో కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టిన ఇప్పటికి రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. కంకర వేసిన బీటీ వేయడం లేదు. దీంతో నిత్యం రెండు గ్రామాల మీదుగా వెళ్లే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల గుడిమల్కాపూర్‌కు చెందిన ఇద్దరు కంకర మూలంగా బైక్‌జారి పడి తీవ్ర గాయాలకు గురయ్యారు. కంకర రాళ్లు, దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నా రోడ్డు పనులు మాత్రం జరగడం లేదు

ప్రమాదాలు జరుగుతున్నాయి



కంకర వేసి బీటీ వేయకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. మా గ్రామానికి చెందిన పలువురు బైక్‌పై నుంచి పడి కాలు, చేతులు విరిగాయి. త్వరగా పూర్తి చేయాలి.

- శివ గుడిమల్కాపూర్, హన్వాడ

తొందరగా పూర్తి చేయాలి



రోడ్డు పనులు మధ్యలో ఆగిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాం. రెండు సంవత్సరాలు గడుస్తున్నా కంకర మాత్రమే వేశారు. బీటీ తొందరగా వేయాలి.

- సుధాకర్ గుడిమల్కాపూర్, హన్వాడ

నిధులు రాకనే ఆలస్యం

చేసిన పనులకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్‌కు పనులు నిలిపివేశాడు. చేసిన పనికి బిల్లులు చెల్లిస్తే బీటీ రోడ్డు వేస్తానని కాంట్రాక్టర్ చెప్పుతున్నాడు. బిల్లులు కానందునే పనులు మధ్యలో ఆపినట్లు చెబుతున్నాడు. పూర్తయ్యేలా చూస్తాం.

- సురేష్, పీఆర్ ఏఈఈ

పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- పది, ఇంటర్ పరీక్షలపై సమీక్షలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు



పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు


మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఫిబ్రవరి 20 : పదవ, ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మగళవారం ఆయన ఐడీవోసీలో 10వ తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలో కనీస వసతులు కల్పించాలన్నారు. పరీక్షల సమయసారిణిని తప్పనిసరిగా పాటించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

● 10వ తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయని, అందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఇందుకు జిల్లాలో 59 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12,866 మంది విద్యార్థులు హాజరుకానున్నరని తెలిపారు. పరీక్షల సమయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

● ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 16 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఇందుకు జిల్లాలో 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 10,976 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 10,954 మంది, మొత్తం 21,930 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షల సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంటుందని, పరీక్షల సమయానికి 30 నిమిషాల ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 1 నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాలలోకి అనుమతించరని తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకేంద్రాలకు చేరుకునేందుకు గాను గ్రామాలలో ఆర్టీసీఈ బస్సులు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అబద్ధాలు మాట్లాడటం తగదు

- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బాలానగర్, ఫిబ్రవరి 20 : బీఆర్ఎస్ పార్టీ నాయకులు అబద్ధాలు మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండల కేంద్రం నుంచి జడ్చర్ల మండలంలోని గంగాపూర్ వరకు రూ.56 కోట్లు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరు అయినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్లను మభ్యపెట్టడం కోసం ఒక జీవో కాపీని తెచ్చి మీడియా ద్వారా ప్రజలకు తెలిజేశారని గుర్తుచేశారు. జీవో కాపీతో పాటు వెంటనే నిధులు తెచ్చి పనులు ప్రారంభించి ఉంటే ఆ ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కేదన్నారు. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకులు గమనించాలని సూచించారు. బీఆర్ఎస్ నాయకులు రైతు బంధు, రైతు రుణమాఫీ గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు వర్ణించారు. పదేళ్ల అధికారంలో ఉండి రుణమాఫీ లేకుండా రైతులను మోసం చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనని అన్నారు. చేసిన తప్పులు ప్రజలు గమనించి ఎన్నికల్లో కేసీఆర్ భాషలో చెప్పాలంటే కర్రు కాల్చి వాత పెట్టారని గుర్తు చేశారు. ఈ సమయంలో నాయకులు అదిరమణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిరుపతి, దత్తాత్రేయ, వెంకట్‌నాయక్, గోపాల్‌నాయక్, బీల్యానాయక్, రఘుయాదవ్, యాదయ్య, పెంట్యానాయక్‌లు పాల్గొన్నారు.

'సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్‌ను పరిష్కరిస్తాం'

పాలమూరు, ఫిబ్రవరి 20 : సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్‌ను వీలైనంత తొందరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీపీఎస్ ఉద్యోగుల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సీపీఎస్ ఉద్యోగుల ప్రధాన డిమాండును సీఎం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. కార్యక్రమంలో బాలస్వామి, రాజశేఖర్, వెంకటయ్యగౌడ్, విజయకుమార్, రాఘవేందర్‌రెడ్డి, బాలరాజు, గడ్డం వెంకటేష్ పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో గిరిజన భవన్

- కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షులు లింగంనాయక్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ హయంలో రూ.2కోట్లతో గిరిజన భవన్ ఏర్పాటుచేస్తామని కాంగ్రెస్ ఎస్టీసెల్ అధ్యక్షులు లింగంనాయక్ అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పట్టణంలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించామని, ఈ వేడుకలకు హాజరైన మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ గిరిజన్ భవన్‌కోసం కోటి రూపాయలు, సేవాలాల్ దేవాలయానికి రూ.40 లక్షలు ఇచ్చామని చెప్పడం సరికాదన్నారు. రూ.15 లక్షలు మాత్రమే ఇచ్చారని గుర్తు చేశారు. నాయకులు కిషన్‌నాయక్, తులసిరామ్‌నాయక్, రవికుమార్, రాంచందర్‌నాయక్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన ఆరె చిన్న సంజీవ(40) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంజీవ మంగళవారం తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై జడ్చర్లకు కూలీ పనినిమిత్తం బయలు దేరాడు. ఉదయం 9 గంటల సమయంలో మార్గమధ్యలో దివిటిపల్లి దగ్గర వెనకనుంచి వచ్చిన డీసీఎం వాహన డ్రైవర్ అతివేగంగా వచ్చి సంజీవ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సరిత రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీసీఎం వాహన డ్రైవర్ వడ్డె వెంకటేశ్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌జెండర్‌లపై యువకుడి దౌర్జన్యం

- అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌పైనా దాడి

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : జడ్చర్ల న్యూబస్టాండు సమీపంలో భిక్షాటన చేసుకుంటున్న తమపై మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన శ్రీకాంత్ దౌర్జన్యం చేశాడని ట్రాన్స్‌జెండర్ పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. బస్టాండు సమీపంలో సోమవారం అర్ధరాత్రి 12:30 నిమిషాల సమయంలో తనతో పాటు వేద అనే ట్రాన్స్‌జెండర్‌లు భిక్షాటన చేసుకుంటున్న తమ వద్దకు వచ్చి ప్రతీ మనిషి రోజుకు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేసి, దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే సందర్భంలో జరిగిన సంఘటనను 100 డయల్‌కు చేయగా, సంఘటన స్థలానికి కానిస్టేబుల్ చందర్‌రావు వెళ్లాడని, అతడిపై సైతం శ్రీకాంత్ దాడి చేసాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమపై దౌర్జన్యంతో పాటు దాడికి పాల్పడిన శ్రీకాంత్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

బాలిక అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : మండలంలోని ఓ గ్రామంలో ఉంటున్న ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాలిక కనిపించడంలేదంటూ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. కాగా ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు మైనర్‌బాలికను ప్రలోభాలకు గురిచేసి తీసుకెళ్లినట్లుగా అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ వివరించారు.

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు

- మంగళవారం ఉద్యమ కార్యాచరణ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఇచ్చిన మాట ఏమైనట్లు ?

- ప్రశ్నిస్తున్న అయ్యవారి పల్లి గ్రామ రైతులు



అయ్యవారిపల్లి గ్రామంలో ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మిడ్జిల్, ఫిబ్రవరి 20 : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులోని ఇసుక తరలింపునకు ఇచ్చిన అనుమతులను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక తరలింపునకు వచ్చిన టిప్పర్లను అడ్డుకున్నారు. ఇటీవల గ్రామానికి ఇసుక తరలింపునకు వచ్చిన టిప్పర్లను రైతులు అడ్డుకొని ఇసుక తరలింపునకు తమ గ్రామానికి రావద్దని ముక్తకంఠంతో చెప్పినా మళ్లీ మంగళవారం ఇసుక కోసం టిప్పర్లు రావడంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతులు నర్సింహారెడ్డి, మల్లేష్, శ్రీకాంత్, హరిప్రసాద్‌రెడ్డిలతో పాటు పలువురు రైతులు మాట్లాడారు. గతంలో ప్రభుత్వ అవసరాల కోసం ఇసుకను తరలించేందుకు అనుమతులిస్తే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి తమ గ్రామానికి వచ్చి అయ్యవారిపల్లి గ్రామంలోని ఇసుకను తరలించకుండా తానే అడ్డుకుంటానని అన్నారని గుర్తు చేశారు. దీంతో పాటు మండలంలోని మట్టి, ఇసుక మాఫియాలపై ఉక్కుపాదం మోపి రైతుల పక్షాన ఉంటానని తమకు హామీ ఇచ్చి నేడు ఇసుకను తరలిస్తుంటే ఎందుకు అడ్డుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనుచరుల పేరుతో ఇసుకను అడ్డుకుంటున్న వారిని ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆరోపించారు. టిప్పర్లను అడ్డుకుంటే జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. నేటి నుంచి ఇసుక తరలింపును నిలిపివేసేందుకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించామని, ఇసుక తరలింపును అడ్డుకోవాలనుకునే పార్టీల నాయకులందరూ తమకు మద్దతు తెలపాలని వారు కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన రైతులందరూ, రైతు సంఘాల నాయకులు ఇసుక తరలింపును అడ్డుకునేందుకు తమకు మద్దతునివ్వాలని కోరారు.

విద్యుత్‌శాఖ ఎస్.ఈ.గా పి.వెంకటరమేష్



పి.వెంకటరమేష్

పాలమూరు, ఫిబ్రవరి 20 : మహబూబ్‌నగర్ టీఎస్ ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్.ఈ)గా పి.వెంకటరమేష్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం సీఎండీ నుంచి ఉత్తర్వులు జారీ అవగా జిల్లాలో నేడు అధికారికంగా విధుల్లో చేరారు. హైదరాబాద్‌లో ఇదే సంస్థలో విజిలెన్స్ వింగ్ (డీపీఈ) ఎస్.ఈగా విధులు నిర్వహిస్తున్న ఈయనను మహబూబ్‌నగర్ ఎస్.ఈ.గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో పనిచేసిన ఎస్.ఈ. ఎన్.శ్రీరామమూర్తిని జనవరి 31వ తేదీన ప్రభుత్వం హైదరాబాద్‌కు బదిలీ చేసి, నారాయణపేట ఎస్.ఈ. వి.ప్రభాకర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న వి.ప్రభాకర్ తిరిగి ఆయన స్థానానికి వెళ్లిపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతిపైనే సంస్థ ఉద్యోగులు పని చేయటంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు నూతన ఎస్.ఈ. మీడియాకు తెలిపారు.

అమ్మవారికి మకరతోరణం బహూకరణ

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : జడ్చర్ల మునిసిపాలిటీలోని విద్యానగర్‌కాలనీలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో అమ్మవారికి మకరతోరణాన్ని రాజశేఖర్‌గౌడ్ దంపతులు బహూకరించారు. దేవాలయం ప్రాంగణంలో మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు మకరతోరణాన్ని అందజేయగా, వాటిని అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గోపాల్‌గౌడ్, గోపమ్మ, మధుసూదన్‌గౌడ్, కల్యాణి, రాధాకృష్ణ, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై కళాజాత ప్రదర్శన

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : జడ్చర్ల మండలం గంగాపురం లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో మంగళవారం హెచ్‌ఐవీపై కళాజాత ప్రదర్శన ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. లైంగిక సంబంధం, రక్తమార్పిడి, తల్లి నుంచి బిడ్డకు, సూదులు-సిరంజీల ద్వారా వ్యాధి సంక్రమిస్తుందని, అంటు వ్యాధి కాదని వివరించారు. ప్రతీ గర్భిణి హెచ్‌ఐవీ పరీక్ష చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఐసీటీసీ కేంద్రంలో పరీక్షలు నిర్వహించుకోవాలని, వివరాలు గోప్యంగా ఉంచుతారని పేర్కొన్నారు. కళాజాత బృందం శ్రీనివాస్, రాజు, శేఖర్, మహేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబీకులకు పరామర్శ

చిన్నచింతకుంట, ఫిబ్రవరి 20 : మండలంలోని ఏదులాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మ్యాతరి చిన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు కొండారెడ్డి, మాజీ ఎంపీటీసీ చిన్న ఊషన్నగౌడ్ తదితరులు మృతుని కుటుంబ భ్యులను పరామర్శించారు.

సైకిల్‌పై ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన

- జడ్చర్లకు చేరుకున్న యాత్ర

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : సైకిల్‌పై ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శన చేపట్టిన బెంగుళూరుకు చెందిన ముత్తుకుమార్ మంగళవారం జడ్చర్లకు చేరుకున్నారు. ఆయనకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాదిమి రవిశంకర్ ఘనంగా స్వాగతం పలికి, భోజన సదుపాయంతో పాటు బస ఏర్పాటు చేసారు. సుమారు 6 నెలల క్రితం బెంగుళూరు నుంచి బయలుదేరినట్లు ముత్తుకుమార్ విలేకరులకు తెలిపారు. కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒరిస్సా, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఢిల్లా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహరాష్ట్రలలోని పుణ్యక్షేత్రాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. అయోధ్య, కాశీ పుణ్యక్షేత్రాలను సందర్శించుకుని ప్రస్తుతం తిరిగి బెంగుళూరుకు వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 30వేల కిలోమీటర్ల మేర సైకిల్‌పై యాత్ర చేపట్టినట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు



ఉడికించడంతో పూర్తిగా పాడైపోయిన గుడ్లు

మహమ్మదాబాద్, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కోడి గుడ్లను ఉడికించగా అవి పూర్తిగా పాడైపోయాయి. కేంద్రాల్లో ప్రతీరోజు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం కింద ఉడికించిన గుడ్లను అందించాల్సి ఉంటుంది. అయితే, మంగళవారం గుడ్లను ఉడికించగా అవి పాడైపోయాయి. విషయాన్ని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీడీపీవో రాజేశ్వరి.. కాంట్రా క్టర్‌పై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రా లకు గుడ్లను పంపిణీ చేసే సమయంలో పరిశీలించాలి. బాగా లేవని అనిపిస్తే వాటిని తిప్పి పంపించాలని సూచించారు.